క్లుప్తంగా

యోగాతో చక్కని ఆరోగ్యం



ఉండిలో యోగాసనాలు నేర్చుకుంటున్న చిన్నారులు

ఉండి: యోగాతో మనమంతా చక్కని ఆరోగ్యాన్ని పొందవచ్చని గ్రంథాయల అధికారి జేవీ కృష్ణమూర్తి అన్నారు. గురువారం ఉండి శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. అనంతరం ఆహార పధార్థాల ద్వారా లభిస్తున్న విటమిన్లు మినిరల్స్ వంటివాటిపై అవగాహన కల్పించారు. అలాగే వేసవి కాలంలో వడదెబ్బ తగుల కుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైవీ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



భీమవరం వైఎస్సార్ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : బాల్యంలో ఏ అంశంపై శిక్షణనిచ్చినా వెంటనే బాలలు అవగాహన చేసుకుంటున్నారని భీమవరం బార్ అసోసియేసన్ అధ్యక్షుడు ఎం.వెంకటరమణారావు అన్నారు. భీమవరం డాక్టర్ వైఎస్సార్ శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. బాల్యం ఎంతో విలువైనదని రాష్ట్ర ప్రభుత్వం వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించడం వారిలో మంచి స్ఫూర్తిని కలిగిస్తుందన్నారు. ఈ సందర్భంగా బాలలకు బి.నాగేశ్వరరావు తెలుగు పఠనం, ఎస్.లక్ష్మి ఆటలు, శ్యామ్ భరతనాట్యం, కె.పద్మావతి, శిరీష ఇంగ్లిష్ రీడింగ్‌పై శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి, ఉండపల్లి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

200 రోజుల ఉపాధి పనులు కల్పించాలి

పెనుగొండ: ఉపాధి పనులు రెండు పూటాల పనివిదానాన్ని తీసుకు వచ్చి, ప్రతీ ఉపాధి కూలీలకి 200 రోజుల ఉపాధి పనులు చూపాలని మండల వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి షేక్ పాదుషా డిమాండ్ చేశారు. గురువారం పెనుగొండ అడ్డపుంత, కొఠాలపర్రుల్లో ఉపాధి కూలీలతో కలిసి సమస్యలపై చర్చించారు. ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ఉపాధి పనులకు మరింతగా నిధులు కేటాయించి, పనిదినాలు పెంచాలని లేదంటే ఆందోళన చేడతామని హెచ్చరించారు. ఈ నెల 12న భీమవరం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

పాలమూరులో చోరీ

పెనుమంట్ర: పాలమూరు గ్రామంలో గురువారం తెల్లవారుజామున యామజాల కాశీవిశ్వనాథం ఇంట్లో చోరీ జరిగింది. ఈ చోరీలో 30 వేలు నగదు, కాసు బంగారపు గొలుసు దొంగలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం ఈ చోరీ జరిగిన సమయంలో కాశీవిశ్వనాథం ఆయన తండ్రి నర్సింహమూర్తి మాత్రమే ఇంట్లో ఉన్నారు. మెయిన్‌రోడ్డు పక్కనే ఉన్న ఈ ఇంట్లో దొంగలు మెయిన్ తలుపు గేటు గొళ్లాన్ని తీసి హాలులో ప్రవేశించిన దొంగలు తండ్రి కొడుకులు నిద్రిస్తున్న గదికి గడియవేసి పక్క గదిలో చోరీకి పాల్పడ్డారు. కాశీవిశ్వనాథం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెనుమంట్ర ఎస్సై బి.సురేంద్రకుమార్ తెలిపారు.

26న నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు

నరసాపురం: నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి పూరిళ్ల శ్రీనివాస్ చెప్పారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి ఏడాది పదవీకాలానికి సంబంధించి నూతన పాలకవర్గాన్ని న్యాయవాదులు ఎన్నుకుంటారని చెప్పారు. ఈ నెల 15, 16 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 17న నామిషన్‌ల పరిశీలన ఉంటుందని చెప్పారు. అలాగే 20 వరకూ నామినేషన్‌ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. 26 ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 గంటలు వరకూ పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు ఉంటుందని పేర్కొన్నారు.

ముగిసిన క్రీస్తు మహాసభలు

పాలకొల్లు అర్బన్: క్రైస్తవ విశ్వాసులు నైతిక విలువలతో జీవిస్తూ నిత్యం దేవుని ప్రార్థిస్తూ జీవనం సాగించాలని అమ్మ తేజ మినిస్ట్రీస్ (కొత్తగూడెం) పాస్టర్ అమ్మ తేజ కోరారు. పాలమూరు బుంగ సామ్యేలు గారి కొబ్బరితోటలో లంకలకోడేరు పేరీస్ పాస్టర్ బీవీ రత్నం అధ్యక్షతన గత మూడు రోజులుగా జరిగిన క్రీస్తు సువార్త ఉజ్జీవ మహాసభలు గురువారం రాత్రితో ముగిశాయి. అమ్మతేజ మినిస్ట్రీస్ సిస్టర్ బ్లెస్సీ, పాస్టర్ అరుణ్ తదితరులు పాల్గొని క్రైస్తవ వర్తమానం అందించారు. పేరీస్ డెలిగేట్ తండా ఇస్సాక్‌రాజు, హైకోర్టు న్యాయవాది (హైదరాబాద్) బుంగ నిర్మల్‌కుమార్, బుంగ పాలు కుమార్ ఆధ్వర్యంలో ఈ ఉజ్జీవ సభలు నిర్వహించారు.

పట్టణాభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్) : భీమవరం పట్టణ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని 7వ వార్డులో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ముందుగా రూ.25 లక్షల నూతనంగా నిర్మించనున్న రజకుల పేటలోని రజకుల కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.38 లక్షలతో కముజువారిపాలెం నందు నిర్మించే ఇంటర్నల్ సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఈ వార్డు ప్రజల ఆకాంక్షను నెరవేర్చడం జరిగిందని పేర్కొన్నారు. వార్డులలో ఇంకా ఎక్కడైనా అభివృద్ధి పనులు జరగాల్సి ఉందని ప్రజలు కోరుకుంటే ఆ వివరాలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని వెల్లడించారు. కరోనా రెండు సంవత్సరాల పాటు అన్ని విధాలుగా ప్రజలతో పాటుగా ప్రభుత్వాన్ని కూడా ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేసిందని గుర్తు చేశారు. ప్రజల కోరిక మేరకు భీమవరంలో జిల్లా కేంద్రాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసుకోగలిగామని, ఉన్నత అధికారులు అందుబాటులో ఉండడం, మున్సిపల్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ పి ప్రశాంతి పనిచేస్తుండడంతో భీమవరం పట్టణాన్ని రాష్ట్రస్థాయిలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి రేయింబవళ్లు కృషి చేస్తున్నానని ఆయన వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, జేసీఎస్ కన్వీనర్ చెల్లబోయిన సూర్యప్రకాష్, పార్టీ నాయకులు ముల్లి నర్సింహమూర్తి, గాదిరాజు రామరాజు, నందమూరి ఆంజనేయులు, కట్టా రవి, కముజు చిన్నా, కముజు శ్రీనివాస్, కముజు వెంకట పెద్దిరాజు, జామి రమేష్, కొట్టాడ ఏసురత్నం, చెల్లబోయిన వెంకన్న, కముజు వెంకట ప్రసాద్, కొట్టాడ రమేష్, జాగవరపు దేవుడు, పాలపర్తి జోనా, గంటా సుందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ లబ్ధి



ఆరేడులో సంక్షేమ లబ్ధి బ్రోచర్‌లు అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఉండి : ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. గురువారం ఉండి మండలం ఆరేడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు ఆలమూరి కృష్ణ, సర్పంచ్ కట్రెడ్డి బ్రహ్మనందం, పార్టీ సీనియర్ నాయకుడు గెడ్డం భాగ్యరాజు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల వివరాలను తెలియచేసి జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. సీఎం పాలనపై ప్రజలంతా సంతృప్తిగా సమాధానం చెప్పడంతో రెట్టించిన ఉత్సాహంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ఒక వైపు రాష్ట్రం, మరోవైపు రాష్ట్ర ప్రజలను అభివృద్ధి చేయాలనే దృఢనిశ్చయంతో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవిని చేపట్టారని అన్నారు. చెప్పింది చెప్పినట్టే చేస్తూ ఎక్కడా ప్రతిపక్షాలకు విమర్శించే అవకాశమే లేకుండా అవినీతి లేని పాలన అందిస్తున్నారని అన్నారు.రాష్ట్రంలో ఓ మూలన అభివృద్ధి చేయడం కాదు నలుమూలల రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నదే సీఎం ధ్యేయమని అన్నారు. కానీ ప్రజలకు ఏంకావాలో వారికి ఏం చేయాలో జగన్‌మోహన్‌రెడ్డికి తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదన్నారు.ఇప్పుడు రాష్ట్రంలోని నిరుపేదలంతా ఇప్పుడు హాయిగా బతుకుతున్నారంటే అదంతా జగన్‌మోహన్‌రెడ్డి విజన్ అని అన్నారు. ప్రజలకు ఇళ్ల స్థలాలు, విద్యార్థులకు అమ్మ ఒడి, రైతులకు వైఎస్సార్‌రైతు భరోసా, మహిళలు చేయూత, అందరి ఆరోగ్య కొరకు వైఎస్సార్ ఆరోగ్య వంటి అద్భుతమైన పథకాలు ఎన్నో ప్రవేశపెట్టి దేనిలోను అవినీతికి తావులేకుండా ప్రజలకు అందిస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో జగనన్న పాలనలో రాష్ట్ర ప్రజలు మరిన్ని అద్భుతాలు చూడబోతున్నారని అన్నారు. దేశం మొత్తం ఇప్పటికే మన రాష్ట్రం వైపు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డివైపు చూస్తున్నారన్నారు. ఆయన చేసే అభివృద్ధికి రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జడ్పీటీసీ రణస్తుల కనకదుర్గమహంకాళి, రాష్ట్ర డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, మండలపార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కె ఆంజనేయారాజు, చింతలపాటి వెంకట్రాజు, చింతలపాటి రఘుపతిరాజు, గంద్రాజు రాజేష్‌వర్మ, రుద్దరాజు సుబ్బరాజు, అల్లూరి రాంబాబు, పెన్మత్స సుబ్బరాజు, కొరకూటి వెంకటస్వామి, ఓగిరాల రత్నరాజు, ఈదా విద్యాసాగర్, పిల్లా సురేష్, బూరగ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు



పెదకాపవరంలో రిటైనింగ్ వాల్ పనులను పరిశీలిస్తున్న పీవీఎల్ నరసింహరాజు

కాళ్ల: రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. ఆకివీడు మండలం పెదకాపవరం గ్రామం నుంచి ఉండి మండలం పాములపర్రు గ్రామం వరకు ఆర్‌అండ్‌బీ సహాయ నిధులు సుమారు రూ.24 కోట్లతో నిర్మిస్తున్న రోడ్ అండ్ డ్రైనేజ్ రిటైనిగ్ వాల్ పనులు జరుగుతున్నాయి.ఈ పనులను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు పొందుతున్న ప్రతి ఒక్కరు ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. ఆకివీడు మండలం పెదకాపవరం నుంచి ఉండి మండలం పాములపర్రు వరకు రోడ్ కం రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పనులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆకివీడు జెడ్పీటీసీ వేగేశ్న వెంకటరాజు, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు



గొల్లవానితిప్పలో ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రవికుమార్

భీమవరం అర్బన్ : అర్హులైన పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తుందని తహసీల్దార్ వై.రవికుమార్ అన్నారు. మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో గురువారం ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో జగనన్న కాలనీలో 2019లోనే అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. కొత్తగా 82 మంది లబ్ధిదారులు ఇళ్ల స్థలాలకు అర్హులు కావడంతో గ్రామంలో ప్రభుత్వం తరుపున రైతుల వద్ద నుంచి భూమిని కొనుగోలు చేశారు. వారు కోర్టును ఆశ్రయించడంతో ఈ సమస్య కోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ విషయమై ఇటీవల లబ్ధిదారులు, గ్రామస్తులు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా సమస్య పరిష్కారానికై తహసీల్దార్ వై.రవికుమార్ ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో సమావేశాన్ని నిర్వహించారు. లబ్ధిదారుల విన్నపాలను స్వీకరించి నివేదికను కలెక్టర్ పి.ప్రశాంతికి అందజేస్తానని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచ్ చిల్లే వెంకటేష్, ఉప సర్పంచ్ బుద్దాల రామకృష్ణ, పెనుమాల నరసింహస్వామి, బోకూరి విజయరాజు, వీఆర్‌వో, కార్యదర్శి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులతో ఎంపీపీ చంటి రాజు, తదితరులు

పాలకోడేరు: చదువుకు పేదరికం అడ్డు కాదని, జగనన్న ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత నిస్తూ, పేద విద్యార్థులు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తోందని పాలకోడేరు మండలం పరిషత్ చైర్మన్ భూపతిరాజు చంటి రాజు అన్నారు. పదో తరగతి పరీక్షల్లో వేండ్ర హై స్కూల్ లో తోట దేవిశ్రీ సాయి శ్రీకర్ (566), వనుం వెంకట అవినాష్ (551), పిండి సూర్య మాధురి (535), పాలా తనూజ(535), వనుం గౌతమ్ కుమార్ (525), జోగి ప్రశాంత్ కుమార్(523), వీరవల్లి జయ మౌనిక (504)లు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి, మంచి మార్కులు సాధించిన ఏడుగురు విద్యార్థులకు గురువారం పురస్కారాలు అందించారు. సర్పంచ్ కడలి నాగేశ్వరి, ఉపసర్పంచ్ భూపతి రాజు సుబ్బరాజు, విద్యా కమిటీ చైర్మన్ బుడితి నాగరాజు, ఎంపీటీసీ పాలాజ్యోతి, వార్డు మెంబర్లు కిరణ్ గోపి,బాలాజీ ప్రధానోపాధ్యాయులుఆనంద హరిప్రసాద్, వేగి రమణ, ఏ శ్యాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు సర్టిఫికెట్లు అందచేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : చదరంగంతో జ్ఞాపకశక్తి పెరిగ ఉన్నత విద్యకు మంచి తోడ్పాటునందిస్తుందని భీమవరం దిశ ఎస్సై జయలక్ష్మి అన్నారు. పట్టణంలోని అనసూయ చెస్ అకాడమీలో నిర్వహించిన జిల్లా స్థాయి మహిళల చెస్ పోటీల్లో విజేతలకు గురువారం బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెస్ పోటీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమన్నారు. చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీల్లో గ్రంధి కావ్య (కాళ్ళ) ప్రథమ స్థానం, దాట్ల భవిష్య (భీమవరం) ద్వితీయ స్థానం, గరగ మోహన ప్రియ (భీమవరం) తృతీయ స్థానం, ఎన్ శృతి (భీమవరం) నాలుగో స్థానంలోనూ విజేతలుగా నిలిచారన్నారు. వీరంతా ఈనెల 17వ తేదీ నుంచి అయిదు రోజుల పాటు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి మహిళల చదరంగం పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్‌కే సురేష్ జైన్, చెస్ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళి, పెదపాటి రవి ప్రసాద్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సాక్షి, భీమవరం : భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం మత్తుపదార్థాలు – మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం అనేక అనర్థాలకు దారితీస్తుందన్నారు. ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ పీవీవీఎస్ఎన్ వర్మ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తోందని దీనికి ప్రజలంతా సహకరించాలన్నారు. ప్రధానంగా విద్యార్థులు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అంతేగాకుండా వారంతా మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల యాంటిడ్రగ్స్ కమిటీ సభ్యులు జీపీఎస్ పద్మారావు, ఏసీఎస్‌వీ ప్రసాద్, జి చలపతిరాజు, డి.చంద్రశేఖర్, యు.నాగబాబు, సెబ్ ఎస్సైలు జి సునీల్‌కుమార్, బి.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి క్రైస్తవ మహాసభలు

ఉండి : ఈ నెల 15వ తేదీ 17వ తేదీ వరకు వాండ్రం గ్రామంలోని సెంయింట్ జాన్ లూథరన్‌చర్చ్ ఆధ్వర్యంలో క్రైస్తవ రక్షణ ఉజ్జీవ మహాసభలను నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. గ్రామంలోని చర్చ్ వద్ద ప్రతి రోజు రాత్రి 7 గంటలకు నిర్వహించే ఈ సభలను పేరిష్ పాస్టర్ రెవరెండ్ వీ నెహ్రూ ప్రారంభిస్తారని ఈ సభలకు బ్రదర్ గ్రేస్‌విక్టర్(పాలచర్ల),బ్రదర్ ఏఆర్ పీటర్‌సన్(జంగారెడ్డిగూడెం),రెవరెండ్ తాజుద్దీన్‌మసీహా(విశాఖపట్నం) నుంచి విచ్చేస్తున్నట్లు సంఘ సీఆర్ పాలపర్తి కెప్టెన్‌రాజు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయం

భీమవరం(ప్రకాశం చౌక్) : పట్టణానికి చెందిన సతివాడ వెంకట సత్యనారాయణ ఇటీవలే అనారోగ్యంతో మరణించారు. బాధితుని కుటుంబానికి స్నేహితులైన లూథరన్ హైస్కూల్ 2002–03 బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.50 వేలు నగదు, రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులను, బియ్యం బస్తాలను అందించారు. ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడానికి దాతలు ముందుకు రావాలని వారు కోరారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల ఇబ్బందులపై అధికారుల దృష్టి

యలమంచిలి: అకాల వర్షం వలన రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకోవడానికి నరసాపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈద అనిలకుమారి, మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి గురువారం మండలంలోని గుంపర్రు, కాంభొట్లపాలెం, చింతదిబ్బ గ్రామాలలో పర్యటించారు. నేరుగా వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి రైతుల ఇబ్బందులు తెలుసుకున్నారు. వారం క్రితం కురిసిన అకాల వర్షానికి తడచిన ధాన్యాన్ని ఎలా ఆరబెట్టాలి? రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని ఏ విధంగా అమ్ముకోవచ్చో? రైతులకు వివరించారు. తేమ శాతం ఎక్కువగా ఉంటే ఏ విధమైన చర్యలు తీసుకోవాలి? ముక్కవుతున్న ధాన్యాన్ని ఏం చేయాలో? వివరించారు. వాతావరణం రోజుకో విధంగా ఉంటున్న నేపథ్యంలో రైతులు సాధ్యమైనంత త్వరగా ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి యలమంచిలి మండల చైర్మన్, బూరుగుపల్లి సొసైటీ త్రిసభ్య కమిటి చైర్మన్ బొంతు వెంకట కర్ణారెడ్డి రైతులు గణపాబత్తుల ఏసుబాబు, జడ్డు బదరీ నారాయణ, పెచ్చెట్టి శ్రీనివాసరావు, అప్పారి వీరాంజనేయులు తదితరులు ఉన్నారు.

విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి



భగ్గేశ్వరంలో మంచినీటి ఫిల్టర్‌బెడ్లను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మునిసిపాల్టీలో విలీనమైన గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయనున్నామని జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు పట్టణంలో విలీనమైన భగ్గేశ్వరం గ్రామంలో గురువారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాస్ పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. భగ్గేశ్వరంలోని ప్రధాన డ్రెయిన్‌తో పాటు కాలనీలోని డ్రెయిన్ల మరమ్మతులు తక్షణం చేపట్టాలని శ్రీనివాస్ మునిసిపల్ అధికారులను ఆదేశించారు. వేసవిలో మంచి నీటి ఎద్దడి ఉన్న గ్రామంలోని శివారు ప్రాంతాలను గుర్తించి అవసరమైతే ట్రాక్టర్ల ద్వారా మంచినీరు అందించాలని ఆదేశాలిచ్చారు. గ్రామంలో మండల పరిషత్ నిధులతో ప్రారంభించిన ఫిల్టర్‌బెడ్స్ పనులను ఆయన పరిశీలించారు. వీటిలో రెండు ఫిల్టర్ బెడ్స్ పనులు పూర్తయ్యాయని, మరో ఫిల్టర్ బెడ్ పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మునిసిపల్ సాధారణ నిధులతో డ్రెయినేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. మునిసిపల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి, మునిసిపల్ డీఈ సాంబశివుడు, జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు, పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, మండల సచివాలయ కన్వీనర్ పార్శి వెంకటరత్నం, మాజీ సర్పంచ్ శిద్దాని శివకోటయ్య, పెచ్చెట్టి కోటేశ్వరరావు, శిద్దాని మహేష్‌కుమార్, అందే మార్కెండేయులు, జోగి శ్రీను, అందే అంకయ్య, ఈద సాయి తదితరులు పాల్గొన్నారు.

పట్టాభిపై చర్యలు తీసుకోవాలి



కాళ్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్న బొండడా పేట సర్పంచ్ గోళ్ల సత్యనారాయణ

కాళ్ల : మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పై టీడీపీ నేత పట్టాభి చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బొండడా పేట సర్పంచ్ పచ్చిగోళ్ల సత్యనారాయణ గురువారం కాళ్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన ఓ టీవీ డిబేట్లో మంత్రి కారుమూరి నాగేశ్వరావును దూషిస్తూ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ప్రభుత్వంపై రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోనేది లేదని మండిపడ్డారు. పట్టాభి పై టీవీ రిపోర్టర్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాళ్ల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు స్పష్టం చేశారు. మంత్రి కారుమూరి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే బీసీ నాయకులంతా ఏకమవుతారన్నారు. బీసీ సంఘం నాయకులు కొండేటి శివకుమార్, గోళ్ల వెంకట రాంబాబు, గంగుల వీరాంజనేయులు, గుత్తికొండ సత్యనారాయణ తదితర బీసీ నాయకులు రాసిన ఫిర్యాదును ఎస్సై మూర్తికి అందజేశారు.